నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మన్ దొడ్డ శివముదిరాజ్, అధ్యక్షుడు సదానంద్, ముఖ్య సలహాదారు వీరేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నియామకం


కొండ సాయి ప్రసాద్ గౌడ్

కాచిగూడ: ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్‌గా కొండ సాయి ప్రసాద్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ యువత సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఏబీవీపీలో కాలేజ్ సెక్రటరీ నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన కొండ సాయి ప్రసాద్‌ను పలువురు విద్యార్థులు అభినందించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రవీణ్, నరేష్, సాయి తదితరులు


ముఠా గోపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్, మోహన్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై నందుకు ముఠా గోపాల్‌ను కలిసి బొకే అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలని, నియోజకవర్గంలోని ఆరు డివిజన్లను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. మోహన్‌నగర్‌లో డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మోహన్‌నగర్ దళిత జాతీయ సంఘం అధ్యక్షులు నరేంద్ర, ప్రధాన కార్యదర్శి కత్తి నర్సింగ్ రావు, మాజీ చైర్మన్ లక్ష్మి, నాయకులు ఆగమయ్య, సంజీవ్, రవీందర్, శ్రీనివాస్, ఈశ్వర్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సన్మానం..

ముషీరాబాద్ ముదిరాజ్ సంఘం చైర్మన్ శివముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముఠా గోపాల్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సదాముదిరాజ్, నాయకులు నాగరాజు, కృష్ణ, కేశవ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రేశం మల్లేష్, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, సత్యనారాయణ, అరుణ్, వెంకటేష్, అజ్జు, సాయి పాల్గొన్నారు.

◆ రెండవ సారి ఘన విజయం సాధించిన ముఠా గోపాల్‌ను నాగమయ్యకుంటకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకట ప్రవీణ్ మామ్స్ రెస్టారెంట్ అధినేత సాయి, నరేష్ తదితరులు భారీ పూలమాలతో ఘనంగా సత్కరించారు.


ఎమ్మెల్యే ముఠా గోపాల్ సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావు

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


మాణిక్‌రావు ఠాక్రేతో దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఈ మేరకు ప్రతినిధి బృందం శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం దుండ్ర కుమార స్వామి మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్‌ను త్వరగా అమలు చేయాలని కోరారు. దీంతో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. ప్రభుత్వ సివిల్ కన్‌స్ట్రక్షన్, మెయింటనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పేర్కొనడం అభినందనీయమన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు నిధుల కేటాయింపుపై మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ, అన్ని బీసీ కులాల సమగ్రాభివృద్ధికి కార్పొరేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రజని నియామకంపై హర్షం

కవాడిగూడ: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్‌రెడ్డి గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగ నియామక పత్రాలపై రెండో సంతకం చేయడం పట్ల తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బండ మైసమ్మనగర్‌లో సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, రాష్ట్ర నాయకులు శివ రత్నం, చంద్రప్రకాష్, బాలయ్య, మల్లేష్, సంగీత, భగవాన్, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు నిరసన దీక్షలో పాల్గొన్న రజనీ తనకు ఉద్యోగం కావాలని రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన విషయాన్ని గుర్తుంచుకున్న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆమెకు ఉద్యోగం ఇవ్వడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గంగపుత్రులు వివక్షకు గురయ్యారని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కట్ట నర్సింగ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రుల సమస్యలను పరిష్కరించండి


ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్య శ్రీ విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ప్రగతిభవన్‌లోని ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఆరోగ్య శ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని, కనీస వేతనం అమలు చేసి టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని, 16 ఏళ్లుగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీల్లోనే నియమించాలని, షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఆరోగ్య మిత్రలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. త్వరలోనే ఆరోగ్య శ్రీ శాఖ ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వీడీసీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని నర్మదా నర్సింగ్‌హోమ్ లేన్‌లో కొనసాగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాంట్రాక్టర్లు డివిజన్‌లోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌సలామ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందిస్తున్న రాజ్‌కుమార్

కాచిగూడ: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.రాజ్‌కుమార్, కె.రాముల ఆధ్వర్యంలో ప్రతినిధులు అభినందించారు. ప్రగతి భవన్‌కు మహాత్మ జ్యోతిరావు పూలే భవన్‌గా నామకరణం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఉద్యమంలో కీలక పాత్ర వహించి, బీసీల ఆర్థిక సామాజిక పరిస్థితులపై అవగాహన ఉన్న పొన్నం ప్రభాకర్ ఆ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో బీసీల సమస్యల పరిష్కారంతో పాటు బీసీల అభివృద్ధి జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు సభ్యుల నియామకం


నూతన సభ్యులను సత్కరిస్తున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డుకు నూతనంగా ముగ్గురు ట్రస్ట్ సభ్యులను నియమించినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలగందల దేవేందర్, అమరం చంద్రశేఖర్, ఆకుల నాగేష్‌లను ట్రస్ట్ సభ్యులుగా నియమించారు. అనంతరం వారిని ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఘనంగా సత్కరించారు. ఈ నెల 25న మున్నూరు కాపు విద్యార్థులకు మెరిట్ అవార్డుల ప్రధానం, పీహెచ్ అందుకున్న విద్యార్థులకు అభినందన సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో ట్రస్ట్‌బోర్డు డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్‌రావు, దడువై రాఘవేందర్ రావు, మంద సూర్యప్రకాష్, ఆకుల పాండురంగ రావు తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో బద్రుక కళాశాల విద్యార్థుల ప్రతిభ


బహుమతులతో బద్రుక కళాశాల విద్యార్థులు

కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ టెబుల్ టెన్నిస్ మెన్ టోర్నమెంట్ పోటీల్లో కాచిగూడలోని బద్రుక కళాశాల విద్యార్థులు పాల్గొని ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించారు. సెంట్ జోసెఫ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో రాణించిన విద్యార్థులు విశాల్ ఆనందం, ఎ.నిఖిల్, డి.శ్రీచరణ్, సిహెచ్ ప్రవీన్ కుమార్, ప్రాణ అగర్వాల్, సాయి చరణ్, భాను, శైలేందర్‌లను బద్రుక కళాశాల కార్యదర్శి శ్రీ కిషన్ బద్రుక, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్ శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ జానకిరామ్, స్పోర్ట్స్ అధికారి మనోజ్‌కుమార్, బి.రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

ముషీరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుని మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు మేడి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించడంతో పాటు రెండు సార్లు ఎంపీగా పని చేసిన అంజన్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి కేటాయిస్తే నగరంలో పార్టీ మరింత బలపడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అంజన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకట్, భాస్కర్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో అత్యాధునిక వసతులు


మాట్లాడుతున్న ఎస్.గోపాల్‌రావు

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటికలో మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం సమితి సర్వసభ్య సమావేశం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా స్మశాన వాటిక ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా శ్మశాన వాటికకు అనుబంధంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్వహణతో పాటు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, ఫిజియో థెరపీ సేవలు, యోగా సెంటర్ ఏర్పాటు చేశామని, స్మశాన వాటిక ఆధ్వర్యంలో మూడు సత్రాల నిర్వహణ చేపట్టామన్నారు. స్మశాన వాటికలో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రాజ్‌కుమార్ విగ్, రాజేందర్ పటేల్, వీరస్వామి, విజయ్‌కుమార్, సి.నందకిషోర్, ఎం.మహేందర్, సత్యనారాయణ, మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

లిబర్టీ: ఆప్తుల అనురాగానికి నోచుకోక వృద్ధాప్యంలో దయనీయ జీవితాలు గడుపుతున్న వృద్ధులు, పేదలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షులు కె.వి.ఎస్.శర్మ అన్నారు. ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుస్తులు, వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో అల్లాడుతున్న పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


మాట్లాడుతున్న లయనెస్ రెబెక్కా


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిలోఫర్

నల్లకుంట: శ్రీ గురు సంకల్పం మానసిక వికలాంగుల వృత్తి శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌అంబర్‌పేట శారదానగర్ కమ్యూనిటీ హాల్‌లో మానసిక వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన లయన్స్ డిస్ట్రిక్ ఉపాధ్యక్షురాలు రెబక్కా, ఆవిష్కార్ క్లబ్ అధ్యక్షురాలు నిలోఫర్ మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులకు శ్రీ గురు సంకల్పం మానసిక వికలాంగుల కేంద్రంలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మానసిక వికలాంగుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రాన్ని ప్రారంభించిన ఎస్. సుబ్బలక్ష్మి బుద్ధిమాంద్య చిన్నారులను తల్లిలా, గురువులా ఆదరించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసిక వికలాంగుల వృత్తి శిక్షణ కేంద్రాన్ని బాగ్ అంబర్‌పేట శారదానగర్‌కు మార్చినట్లు తెలిపారు. సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే మరికొందరు మానసిక వికలాంగులకు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కోటయ్య, ప్రిన్సిపాల్ ఎం. సత్యబాల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వరలక్ష్మి, అనురాధ, కళ్యాణి, పి. లక్ష్మి, మానసిక వికలాంగ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

చిక్కడపల్లి: నూతన ప్రభుత్వంలో చేనేత వర్గాలకు మేలు జరగాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ చేనేత వర్గాలకు జీఎస్టీ నంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

నేడు సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణయుగ సినీ సంగీత సంబురాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు వీకే దుర్గ తెలిపారు. శుక్రవారం రాత్రి వివేక్‌నగర్‌లో ఆమె మాట్లాడుతూ శనివారం త్యాగరాయగాన సభలో జరిగే ఈ కార్యక్రమంలో 12 గంటల పాటు నిర్విరామ సంగీత స్వరధార శీర్షికతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖులకు నందమూరి, అక్కినేని, ఘంటసాల అవార్డులను ప్రదానం చేస్తామన్నారు.

ఫైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్, వినాయక్‌నగర్‌లో నెలకొన్న కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నట్లు కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ తెలిపారు. ఇటీవల వినాయక్‌నగర్ బస్తీ వాసులు నల్లాల్లో తాగునీటిలో కలుషిత నీరు వస్తుందని వచ్చిన ఫిర్యాదు మేరకు వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో రూ.9లక్షల వ్యయంతో సమస్య పరిష్కారానికి నూతన పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం ఆమె బీజేపీ నేతలు, వాటర్‌వర్క్స్ సిబ్బందితో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్మాణ పనులు చేపట్టి త్వరలోనే ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరుశురాం, మహేందర్‌బాబు, శ్రీనివాస్‌ముదిరాజ్, శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

హిమాయత్‌నగర్: దేశంలో, రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల్లో నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారాలు చెల్లించి న్యాయం చేయాలని బాధిత రైతాంగ పోరాట వేదిక కన్వీనర్, హైకోర్టు న్యాయవాది తన్నీరు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారాం ప్రాజెక్ట్ కారణంగా రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనేతర రైతులకు మధ్య భూ మార్పిడిపై ఎలాంటి కొనుగోళ్లు జరపరాదని చట్టంలో పేర్కొన్నా, అక్కడ బాధిత రైతులకు రూ.8లక్షలు ఇచ్చి, పక్కనే ఉన్న ఇతర ప్రాంతాల వారికి రూ. 30 లక్షల నష్టపరిహారం చెల్లించారన్నారు. గిరిజన చట్టాలను అనుసరించి వారికి ఎకరాకు రూ.35 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబాల కోసం పార్లమెంట్‌లో ప్రకృతి విపత్తు చట్టాలను చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం బాధిత రైతుల సమస్యలు పరిష్కరించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వేదిక నాయకులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ డీటీ దుర్మరణం

ఖైరతాబాద్: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన టి.పాల్(69) రిటైర్డ్ డిప్యూటీ తాహశీల్దార్. ఇటీవల మెహిదీపట్నంలో నివాసముంటున్న కుమారుడి ఇంటికి వచ్చిన ఆయన శుక్రవారం యాక్టివాపై లక్డీకాపూల్ నుంచి రాజ్‌దూత్ చౌరస్తా వైపు వెళ్తుండగా ఆర్మీ వాహనాన్ని ఢీ కొని కింద పడ్డాడు. హెల్మెట్ ధరించనందున తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు పాల్ చరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్ రెడ్డి హయాంలో పెన్షనర్లు , ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో పెన్షనర్లు,ఉద్యోగులు మార్పు కోసం ఎదురు చూసారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న గోపన్ పల్లి ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.అశోక్ రెడ్డి, నేతలు జి.సూర్యకళ, వి.దివాకర్, సీహెచ్ వీరభద్రయ్య, ఎస్.వేణుగోపాల్, డి.పవన్ కుమార్, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలి

పంజగుట్ట: తెలంగాణ మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపకులు భూక్యా సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో లంబాడీలు కాంగ్రెస్‌కు మద్దతు పలికారన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ధరావత్ నవీన్ నాయక్‌తో కలిసి మాట్లాడుతూ .. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే లంబాడీలకు న్యాయం జరుగుతందని భావించామని లంబాడీ తాండాలు రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా, తాండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తారని భావించామన్నారు. 40 లక్షల జనాభా ఉన్న తమకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 2018లో బీఆర్‌ఎస్‌లో 7 మంది లంబాడీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 4 గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. తమకు ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇస్లావత్ బాలాజీ నాయక్, సుమాన్ నాయక్, కల్యాణ్ నాయక్, భూక్యా భజన్ నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలను ఆదుకోండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆదిలీలా ఫౌండేషన్ సభ్యుల వినతి


మంత్రి కిషన్‌రెడ్డితో ఎస్.ఆదినారాయణ

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం చేయూత నివ్వాలని కేంద్ర పర్యటన శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఆదినారాయణ విన్నవించారు. శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కళా సాహితీ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న సంస్థలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారన్నారు. సేవా సంస్థలు పేద, మధ్య తరగతి అణగారిన వర్గాలకు సేవ చేయాలని సూచించారు.

వైభవంగా బాలోత్సవ ముగింపు వేడుకలు





సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవ ముగింపు వేడుకలు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలోని విప్రో చంద్రయాన్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. 102 పాఠశాలలకు చెందిన 6 వేల మంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మ, దాండియా, కోలాటంతో పాటు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డెక్కన్ పత్రిక ఎడిటర్ వేదకుమార్, భారత్ విద్యా సంస్థల అధినేత వేణుగోపాల్, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు పిల్లల కోసం సమయాన్ని కేటాయిస్తూ వారిలోని ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, సుజావతి, కోయ వెంకటేశ్వర్లు, విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్, మమత, రూపా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర్లకు ప్రాధాన్యం కల్పించాలి

లాలాపేట: రాష్ట్రంలో ఇటీవల నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణలోని కుమ్మర్లకు జనాభా దామాషా ప్రకారం పాలనాపదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు కుమ్మర్లను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. తెలంగాణలో మొట్టమొదటిసారిగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని ఆయన కోరారు.